సాక్షి పల్నాడు

బుధవారం । 28 । ఆగస్టు । 2024



మొక్కల పెంపకంపై స్థల పరిశీలన

ఫిరంగిపురం: 113త్యాళ్లూరు గ్రామంలో మొక్కల పెంపకం కోసం పలు ప్రభుత్వ స్థలాలను జెడ్పీ సీఈఓ వసంతరాయుడు, డీపీఓ శ్రీదేవి మంగళవారం పరిశీలించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నీటినిల్వ 45.46 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 45185 క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 57876 క్యూసెక్కులు వదులుతున్నారు.

మంగళ గౌరీగా బండ్లమ్మ దర్శనం



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువై ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శ్రంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని మంగళగౌరీగా అలంకరించారు.

న్యూస్‌రీల్

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయమూర్తి



తెనాలిరూరల్: తెలుగు భాషాదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తెనాలిలో న్యాయమూర్తి తెలుగులో తీర్పు చెప్పారు. తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ ఓ కేసుకు సంబంధించిన తీర్పును తెలుగులో చెప్పారు. వేమూరి భిక్షాలు, వేజండ్ల విక్రమ్‌ల మధ్య ఆర్థిక లావాదేవీల కేసు నడుస్తోంది. కేసు మంగళవారం విచారణకు రావడంతో న్యాయమూర్తి పవన్‌కుమార్ సాక్ష్యాధారాలను పరిశీలించారు. భిక్షాలుకు విక్రమ్ రూ. 3,75,666 చెల్లించాలని తీర్పు తెలుగులో చెప్పారు. ఈ వారమంతా రోజుకో తీర్పు తెలుగులో చెప్పనున్నట్టు న్యాయమూర్తి తెలిపారు.

హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూలులో 230మందికి శిక్షణ

17వ బ్యాచ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి



నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రభుత్వం నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూలులో ఇప్పటివరకు 230మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ్చినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మంగళవారం వెల్లడించారు. మంగళవారం డిపోలో 16వ బ్యాచ్ శిక్షణ పూర్తిచేస్తున్న 16మంది అభ్యర్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. 17వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం కాబోతుందని, దీనిలో చేరే లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు సీట్లకోసం 7382896038, 7382896158, 9959225428 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జీఎన్ఎం సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం




గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం గుంటూరు వైద్య కళాశాలలో ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 – మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2 – సాయంత్రం 5 గంటల వరకు జరిగాయి. సెప్టెంబర్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లావ్యాప్తంగా అప్లై చేసుకున్నవారిలో 550 మంది రాగా, 30 మంది గైర్హాజరయ్యారు. చీఫ్ ఎగ్జామినర్‌గా జీజీహెచ్ సివిల్ సర్జన్, ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, అబ్జర్వర్‌గా నర్సింగ్ కళాశాల లెక్చరర్ వెంకటరమణ వ్యవహరిస్తున్నట్లు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ సుజాతరాణి తెలిపారు.

14న జిల్లాలో 'జాతీయ లోక్ అదాలత్'

నగరంపాలెం: సెప్టెంబరు 14న జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం జిల్లా అంతటా లోక్ అదాలత్ బెంచలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కక్షిదారులు, పోలీసులు, స్టేక్ హోల్డర్లు ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలని పేర్కొన్నారు.

ఇసుక ఆన్‌లైన్ విధానం పరిశీలన



తాడికొండ: తుళ్ళూరు మండలంలో కొనసాగుతున్న ఇసుక బుకింగ్ ఆన్‌లైన్ విధానాన్ని గురువారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ పరిశీలించారు. ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.గంగరాజుతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో ఈ విధానం గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పలువురు లారీ ఓనర్లు, డ్రైవర్లకు సూచనలిచ్చారు. తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు, తుళ్ళూరు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలలో ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నందున చేసుకున్న వెంటనే డిజిటల్‌గా నగదు చెల్లించాలని సూచించారు. ప్రధాన రహదారిలో లారీలతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలలో ఇసుక బుకింగ్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.



వైద్యులకు రక్షణ కల్పించాలి

రోగులకు నిత్యం సేవలు అందజేసే ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. కోల్‌కతాలో మెడికల్ కళాశాల హాస్పిటల్‌లో వైద్య సేవలు అందజేస్తున్న ట్రైనీ పీజీ మహిళా డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య జరగడం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటన. దీనికి ఆ రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. డాక్టర్లకే రక్షణ లేకపోతే వారు రోగులకు నాణ్యమైన వైద్యం ఏవిధంగా అందించగలుగుతారు.

– డాక్టర్ నంద్యాల రాంప్రసాదరెడ్డి, శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు, నరసరావుపేట





భయంలేని వాతావరణం కల్పించాలి

డాక్టర్లు స్వేచ్ఛగా వైద్యం అందజేసే పరిస్థితులు రావాలి. దీనికి పటిష్టమైన చట్టాలను ప్రభుత్వం తీసుకురావాలి. మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ హాస్పిటళ్లలో ఎటువంటి సౌకర్యాలు ఉండటంలేదు. చాలా అధ్వానస్థితిలో శిక్షణ తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వీటన్నింటిని అధిగమించేలా ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించాలి. సరైన నిధులు కేటాయించాలి.

– డాక్టర్ మేకల చంద్రకిరణ్, దంత వైద్యుడు, నరసరావుపేట

పచ్చమూకల దాష్టీకం

- ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచి దాడులకు తెగబడుతున్న టీడీపీ నేతలు
- హత్యలు, దోపిడీలతో నారాహంతక ముఠా స్వైర విహారం
- మహిళలు అని కూడా చూడకుండా వేధింపులు
- చోద్యం చూస్తున్న పోలీసులు

దళిత యువతిని ఆత్మహత్య చేసుకునేలా పురిగొల్పిన టీడీపీ నేతలు



రోదిస్తున్న మనీషా కుటుంబ సభ్యులు



మనీషా దూకిందని భావిస్తున్న కాలువను పరిశీలిస్తున్న సీఐ వెంకట్రావు

పిడుగురాళ్ల రూరల్: ఎన్నికల ఫలితాలు వెలువడిన తొలి రోజు నుంచే పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నేతలు దాడులు చేస్తున్నారు. తమకు మంచి చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఓటు వేశారన్నా కారణంగా భౌతిక దాడులకు దిగడమే కాకుండా ఆర్థికంగా దెబ్బకొడుతూ... మానసికంగా హింసిస్తున్నారు. మహిళలు అని కూడా చూడకుండా దాడులు చేస్తూ నారా హంతక ముఠా స్వైర విహారం చేస్తోంది. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఆత్మహత్యకు పురిగొల్పేలా వేధింపులు..

తాజాగా మంగళవారం దళిత యువతి మనీషా ఆత్మహత్య చేసుకునేలా టీడీపీ నాయకులు ఇబ్బందులకు గురిచేశారు. పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామంలో తన తండ్రికి చెందిన రేషన్ దుకాణం నిర్వహిస్తూ జీవనాధారం పొందుతున్న మనీషాను బెదిరించి, భౌతికంగా దాడులు చేసి మనోవేదనకు లోనయ్యేలా అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు వెంకటేశ్వర్లు, పిచ్చయ్యలు వ్యవహరించారు. దీంతో మనస్థాపం చెందిన యువతి అదృశ్యమైంది. యువతి కోసం ఆమె చెప్పులు, చున్నీ, సూసైడ్ నోట్ దొరికిన సాగర్ కాలువ వద్ద పోలీసులు, యువతి బంధువులు మంగళవారం రాత్రి 9 గంటలవరకు గాలింపుచర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో యువతి ఒకవేళ కాలువలో దూకి ఉంటే కొట్టుకొని పోయి ఉంటుందని భావిస్తున్నారు. యువతి క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు. నకరికల్లు మండలం చేజర్ల, గుత్తికొండ బిలం సమీపంలోని లాకులు వద్ద ఆచూకీ లభిస్తుందేమోననే ఉద్దేశంతో పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

రేషన్ షాపు కోసం మాపై దాడి..



రేషన్ షాపు ఇవ్వాలంటూ వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, కొండలు, శ్రీను, చుక్కడు మరో 20 మంది ఇంటి వద్దకు వచ్చి నా కుమార్తె మనీషాను, నన్ను దుర్భాషలాడుతూ భౌతిక దాడికి దిగారు. దీంతో కొన్ని రోజులుగా మనీషా మనోవేదనకు లోనైంది. వారు చేసిన దాడుల వల్లే మనీషా కాలువలోకి దూకి ఉంటుంది.

– ఎల్.కుమారి, మనీషా తల్లి

కేసులు పెడతామని బెదిరించారు..



రేషన్ షాపు ఇవ్వటమే కాకుండా, మీరు అదనంగా డబ్బులు కట్టాలని లేకపోతే మీపై కేసులు పెడతామని తెలుగుదేశం పార్టీ నాయకులు, కొంత మంది అధికారులు వచ్చి బెదిరించారు. మేము వినకపోయేసరికి మా అమ్మపై, చెల్లిపై దాడులకు కూడా దిగారు.

– పుష్పలత, మనీషా సోదరి

ఇంతకన్నా దారుణం ఏమన్నా ఉందా..?

- మహిళలను వేధింపులకు గురిచేయడం దారుణం
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్లరూరల్: కూటమి ప్రభుత్వంలో దాడులు, అక్రమాలు, హత్యలు తప్ప అభివృద్ధి ముచ్చుకైనా కానరావడం లేదని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పిడుగురాళ్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జూలకల్లు గ్రామంలో దళిత మహిళ మనీషా తన తండ్రి రేషన్ షాపును ఆయన మృతి అనంతరం నిర్వహిస్తోందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నేతలు ఆమె షాపును తొలగించడమే కాకుండా అక్రమ కేసులు పెడతామని హింసించడం మొదలుపెట్టారన్నారు. పైగా రూ.70 వేల నుంచి రూ. 80 వేలవరకు కట్టాలని బెదిరించడంతో ఆమె కాలువలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఇంతకన్నా దుర్మార్గం మరొకటి ఉండదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆడపడుచులపై మరి ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. పోలీసులు వెంటనే ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని, బుధవారం పార్టీ నాయకులతో కలిసి మహిళ కుటుంబాన్ని పరామర్శిస్తామని ఆయన తెలిపారు.

సచివాలయాల్లో నగదు చెల్లిస్తేనే ఇసుక

- జిల్లాలో నాలుగు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు నిల్
- ప్రస్తుతం కొండమోడు, మాదిపాడు వద్ద మాత్రమే స్టాక్
- నిర్ణయించిన ధరకంటే ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా చర్యలు
- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



మాదిపాడు ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

అచ్చంపేట: గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో నగదు చెల్లించినవారికి మాత్రమే ఇసుక లోడింగ్ జరుగుతుందని ఎట్టి పరిస్థితులలోను లోడింగ్ పాయింట్‌వద్ద వసూళ్లు ఉండవని పల్నాడు జిల్లా కలెక్టరు అరుణ్‌కుమార్ స్పష్టంచేశారు. మండలంలోని మాదిపాడు ఇసుక స్టాక్ పాయింట్‌ను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఆరు శాండ్ పాయింట్లు ఉండగా నాలుగు చోట్ల ఇసుక నిల్వ లేదన్నారు. కొండమోడు వద్ద కూడా రెండు మూడు రోజుల్లో అయిపోతుందన్నారు. అచ్చంపేట మండలం, మాదిపాడు వద్ద 30వేల టన్నులు ఉన్నట్లు చెప్పారు. మాదిపాడు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కావలసినవారు టన్నుకు రూ.192 సచివాలయంలో చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. అదికూడా నదిలోనుంచి ఇసుకను స్టాక్ పాయింట్‌కు తరలించినందుకు, లారీలలో లోడింగ్ చేసినందుకు, గ్రామ పంచాయతీ చట్టం ప్రకారం పంచాయతీకి చెల్లించాల్సిన సీనరేజిసెస్ మొత్తం కలుపుకొంటే టన్నుకు రూ.192 ఖర్చు అవుతుందన్నారు. ఈ మొత్తాన్ని మాత్రమే వినియోగదారు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంతకమించి ఒక్కరూపాయి ఎక్కువ తీసుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సచివాలయాలవద్ద ధరల పట్టికలు ఉంటాయన్నారు. అయితే రవాణా రేట్లల్లో వ్యత్యాసాలుంటాయన్నారు. సాయంత్రం 6 గంటల తరువాత ఇసుక రవాణా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడేవారిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

300 వాహనాలపై కేసులు నమోదు చేశాం : జిల్లా ఎస్పీ

అచ్చంపేట, అమరావతి మండలాలలో స్పెషల్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన లారీలు, ట్రాక్టర్లు, పొక్లెయిన్‌లను సీజ్ చేసినట్లు చెప్పారు. సాయంత్రం ఆరు తరువాత అక్రమ మైనింగ్ జరగకుండా గట్టిచర్యలు తీసుకున్నామన్నారు. నిర్ణయించిన రీచ్‌లలో కాకుండా వేరే ప్రాంతాలలో ఇసుకను అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్న 300 వాహనాలపై ఇప్పటికే కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వారివెంట సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, ఆర్డీఓ మురళి, మైనింగ్ అధికారి నాగిని, అచ్చంపేట తహసీల్దారు జి. శ్రీనివాసయాదవ్, అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

30న సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన



జేఎన్‌టీయూఎన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, ఎస్పీ శ్రీనివాసరావు

- కాకాని జేఎన్‌టీయూఎన్‌లో వనమహోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేటరూరల్: ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌లు పల్నాడు జిల్లాలో పర్యటించనున్నారు. కాకాని సమీపంలోని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న వనమహోత్సవంలో వీరు పాల్గొననున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు మంగళవారం ఏర్పాట్లు పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావులు కళాశాలను సందర్శించారు. హెలిపాడ్, సభాస్థలి ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాలను శుభ్రం చేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూఎన్ కళాశాల యాజమాన్యంతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఆర్డీఓ శ్రీదేవి, డీఎస్పీ నాగేశ్వరరావు, తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్అండ్‌బీ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

హైవే స్పీడుగా పనులు

రెండు రాష్ట్రాలు.. ఒక రోడ్డు

- వాడరేవు- పిడుగురాళ్ల హైవే
- మారనున్న రూపురేఖలు
- ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు
- 2025 డిసెంబర్ నాటికి పూర్తి లక్ష్యం
- రెండు రాష్ట్రాల మధ్య తగ్గనున్న దూరం

వాడరేవు నుంచి పిడుగురాళ్ల హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ హైవేతో జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలతోపాటుగా పర్యాటక రంగం, వ్యాపార రంగాలు అభివృద్ధిలో దూసుకెళ్లనున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. వచ్చే ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రహదారి రానుందని అధికారులు చెబుతున్నారు.



వాడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ఇన్‌సెట్‌లో హైవే మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకట మురళి(ఫైల్)



చీరాల: గత ప్రభుత్వ హయాంలో వాడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టింది. రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలపడంతో పాటుగా రూ.667 కోట్లు నిధులు కూడా విడుదల చేయించారు. ఈ రోడ్డు వాడరేవు నుంచి పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా నకరికల్లు అడ్డరోడ్డు వరకు 81.5 కిలోమీటర్ల మేర రహదారిని వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వాడరేవు- పిడుగురాళ్ల వరకు 47 కిలోమీటర్ల వరకు నాలుగు వరసల జాతీయ రహదారిగా నిర్మాణాన్ని చేపట్టారు.

లక్ష్యం మేరకు పనులు

2025 డిసెంబర్ నాటికి ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు, ప్రభుత్వం పనులు ముమ్మరం చేసింది. ఈ రహదారి నిర్మాణం కోసం 103 హెక్టార్ల భూమి అవసరం కాగా 22.30 హెక్టార్ల ప్రభుత్వ భూమిని కేటాయించగా మిగిలిన 82.70 హెక్టార్ల భూమిని ప్రజల నుంచి సేకరిస్తున్నారు. ఈ రహదారి నాలుగు లైన్లతో నిర్మాణం చేపట్టనున్నారు. జాతీయ రహదారికి 167-ఏగా పేరు పెట్టారు. 24 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్న రహదారికి ఆధునిక యంత్రపరికరాలతో పనులు చేయిస్తున్నారు.

బాపట్ల జిల్లా పరిధిలో..

ఈ రహదారి నిర్మాణంలో 37 కిలో మీటర్ల రోడ్డు బాపట్ల జిల్లా పరిధిలోనే ఉండటంతో జిల్లాకే తలమానికంగా మారనుంది. హైవే నిర్మాణం పూర్తయితే వినియోగంలోకి వస్తే జిల్లాకే మణిహారంలా ఉంటుందని చెబుతున్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం హైదారాబాద్‌కు తక్కువ సమయంలో చేరుకోవడంతో పాటుగా తీర ప్రాంతాలకు పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలానే ఈ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి త్వరగా నష్ట పరిహారం అందించేందుకు అధికారులు అన్నీ చర్యలు తీసుకుంటున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అటు పర్యాటకరంగం, ఇటు రియల్ రంగం వృద్ధి చెందడంతో పాటుగా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. చిన్న హోటళ్ల నుంచి పెద్ద రిసార్టులు, చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. చీరాల మండలంలోని వాడరేవు ప్రధాన రహదారిని వెడల్పు చేయడంతో పాటు నాలుగు మేజర్ బ్రిడ్జిలు, ఆరు అండర్ పాస్ బ్రిడ్జిలను కూడా నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ 167-ఏ అందుబాటులోకి వస్తే చీరాలలో అన్నదాతలు పండించిన పంటల ఎగుమతులు పెరగడంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు కేవలం నాలుగు గంటల్లోనే చేరుకోవచ్చు.

హైవేతో ఉపాధి అవకాశాలు

వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రాహదారి 167-ఏ వల్ల మత్స్యకారులకు ఎంతో ఉపయోగం. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు ఎక్కువ అవకాశం ఉంది. ఎన్నో ఏళ్లుగా మత్స్య సంపద రవాణాకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. త్వరలో రహదారి వినియోగంలోకి తీసుకువస్తుండటంతో పర్యాటకుల సంఖ్య పెరగడంతోపాటు మత్స్యకార గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– ఎరిపెల్లి రమణ, మాజీ సర్పంచి, వాడరేవు

డిమాండ్ల పరిష్కారం తర్వాతే పనులు

- పిడుగురాళ్ల – చీరాల వాడరేవు హైవే పనులు అడ్డుకున్న రైతులు
- మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం అందించాలని ధర్నా



రావిపాడు వద్ద ధర్నా చేస్తున్న రైతులు

నరసరావుపేట రూరల్: పిడుగురాళ్ల- చీరాల వాడరేవు రోడ్డు పనులను రైతులు అడ్డుకొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించిన తరువాతే పనులు ప్రారంభించాలని నరసరావుపేట – నకరికల్లు రోడ్డులో ధర్నా నిర్వహించారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నాలుగు గ్రామాల రైతులు ధర్నాలో పాల్గొన్నారు. పిడుగురాళ్ల – చీరాల ఓడరేవు రోడ్డు నిర్మాణంలో భాగంగా రెవెన్యూ అధికారులు మంగళవారం మండలంలోని రావిపాడు వద్ద కొలతలు తీసి మార్కింగ్ ఇచ్చే పనులు చేపట్టారు. ఈ పనులను రావిపాడు, ఇస్సప్పాలెం, జొన్నలగడ్డ, కేసానుపల్లి గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకున్నారు. మార్కింగ్ వేసేందుకు వచ్చిన సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. రోడ్డు నిర్మాణం ద్వారా నాలుగు గ్రామాల్లో విలువైన భూములు కోల్పోతామన్నారు. రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం అందించాలని స్పష్టంచేశారు. లేకుంటే రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ వచ్చేవరకు పనులు చేపట్టవద్దని తెలిపారు. దీంతో సిబ్బంది పనులు నిలిపివేసి వెనుతిరిగారు.

క్లుప్తంగా

పులిచింతలకు 45,387 క్యూసెక్కులు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్ల ద్వారా 45,387 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏడీఈ ఎస్.జయశంకర్, ఏఈ జయపాల్ మంగళవారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 3 క్రస్ట్‌గేట్లు రెండు మీటర్లు, ఒక క్రస్ట్‌గేటు 1.50 మీటర్లు ఎత్తి 36,918 క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా 1.0627 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అనంతరం 8,466 క్యూసెక్కులు మొత్తం 45,384 క్యూసెక్కులను దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ నీటిమట్టం ప్రాజెక్టు 75.50 మీటర్లకు గాను 75.46 మీటర్లకు నీరు చేరుకుందని రిజర్వాయర్‌లో గరిష్ఠ స్థాయిలో 7.080 టీఎంసీలకు గాను 7.052 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 55.99 మీటర్లకు చేరుకుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం మురళీనగర్ వద్ద మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మంతెన గోపాలరావు (53) స్థానికంగా ఓ ఇనుము దుకాణంలో పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తుంటాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై కూర్చొని దుకాణంలోని గుమస్తాను పిలుస్తుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనం వేగంగా ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై కూర్చున్న గోపాలరావుకు గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రుడిని ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలి



వైద్యులపై దాడులు జరిగినప్పుడు స్పందించడం కంటే జరగకుండా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి వాటిని అమలు చేయాలి. తల్లిదండ్రులు చిన్నతనం నుంచే మహిళలపై గౌరవం పెరిగేలా మగ పిల్లలకు నేర్పించాలి. వ్యసనాలకు, మత్తుకు బానిసలు కాకుండా చూడాలి. వైద్యశాలల్లో రాత్రిళ్లు విధులు నిర్వహించే మహిళా వైద్యులకు రక్షణగా కానిస్టేబుళ్లను ఉంచాలి.

–డాక్టర్ జొన్నలగడ్డ చైతన్య, పెదకూరపాడు, సీహెచ్‌సీ



కఠినమైన చట్టాలు తేవాలి

పేద, ధనిక, కులం, మతం అనే భావన లేకుండా అందరికీ వైద్యం అందించి ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకపోవడం బాధాకరం. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. దోషులకు కఠిన శిక్షలు విధించాలి. ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి.

– విజయశాంతి, ఎంఎల్‌హెచ్‌పీ, మాచాయపాలెం, బెల్లంకొండ



టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

ఇల్లు కూల్చివేసినందుకు నిరసనగా కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు, కేఎన్‌పీఎస్ నాయకులు

నరసరావుపేట: గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే కారణంతో చిలకలూరిపేట మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల ఏడుకొండలు ఇల్లు కూల్చి కులం పేరుతో దూషించిన టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బాధితులు ధర్నా చేశారు. నిందితులకు వత్తాసు పలుకుతున్న చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐ అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణ మాట్లాడుతూ యడవల్లి గ్రామంలో ఎరుకల కులానికి చెందిన ఏడుకొండలు ఇంటిని పొక్లెయిన్‌తో కూల్చి అనంతరం ఇంటి శిథిలాలను ట్రాక్టర్‌లో వేసుకుని ఊరు చివర ఉన్న వాగులో పడేసిన తన్నీరు గోవిందరాజు అతని బంధువులను ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద వెంటనే అరెస్టు చేయాలని కోరారు. నిందితుల ఫిర్యాదు మేరకు బాధిత కుటుంబంపైనే రూరల్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ నమోదు చేసిన తప్పుడు కేసు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, నిందితులతో రాజీ చేసుకోవాలని రూరల్ ఎస్‌ఐ బాధితులను బెదిరించాడని తెలిపారు. బాధితులపై అక్రమ కేసు నమోదు చేసిన రూరల్ ఎస్‌ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేఎన్‌పీఎస్ ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్నప్రసాద్, కొయ్యలమూడి జయమ్మ, బయ్యవరపు సతీష్, నాగిపోగు శ్రీనివాసరావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, ప్రజాకళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, రాణితో పాటు వివిధ గ్రామాల్లోని ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సరిలేక ఇబ్బందులు

అచ్చంపేట సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసు, శ్రీనివాసరావు

అచ్చంపేట: 570మంది విద్యార్థులున్న స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక స్నానాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గార్లపాటి దాసు, బందెల శ్రీనివాసరావులు తెలిపారు. మంగళవారం వారు పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. పాఠశాలలో కొన్ని భవనాలు, డైనింగ్‌హాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. విద్యుత్ సక్రమంగా లేకపోవడంతో టాయిలెట్స్‌కు వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. భోజనం ఫరవాలేదని, అయితే ప్రతిరోజు ఇదేవిధంగా ఉండాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. శిథిలావస్థకు చేరిన వచ్చిన భవనాలపై గతంలో సోషల్ వెల్ఫేర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. శాశ్వత ఉపాధ్యాయులతో పాటు అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తున్నామన్నారు. అయితే గత నాలుగు నెలలుగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వేతనాలు రావడంలేదని ప్రిన్సిపాల్ తెలిపారు. మంత్రి డోల బాలవీరాంజనేయులు, జిల్లా కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో వేతనాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని గార్లపాటి దాసు, శ్రీనివాసరావులు తెలిపారు.

ఫొటోల బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించాలి

నరసరావుపేట ఈస్ట్: పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా తప్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమం ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేదిగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం ఫొటోలు తీసే బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పిస్తూ ఆ బాధ్యతలను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, సచివాలయం ఉద్యోగులను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయితే ప్రతి రోజు సాయంత్రం 10 అంశాలతో కూడిన గూగుల్ ఫామ్‌ను పాఠశాలల హెచ్‌ఎంలు అప్‌లోడ్ చేయాలని చెప్పటం దారుణమన్నారు. ఫొటోలు తీయకుంటే దానికి ప్రధానోపాధ్యాయులను బాధ్యులుగా చేయటాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని తెలిపారు. ఈమేరకు డీఈఓ ఎం.వెంకటేశ్వర్లును కలసి వినతిపత్రం సమర్పించారు.

వ్యవసాయ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి



డీఏఓ మురళికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేటరూరల్: రైతు సేవా కేంద్రం(ఆర్‌ఎస్‌కే) సిబ్బంది క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళిని గ్రామ వ్యవసాయ సహాయకుల అసోసియేషన్ సభ్యులు కోరారు. లింగంగుంట్లలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో డీఏఓ మురళిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ–పంట నమోదులో రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల్లో వెసులుబాటు కల్పించాలని కోరారు. మహిళలు, దివ్యాంగులను దృష్టిలో పెట్టుకుని జియో ఫెన్సింగ్–కనీసం 500 మీటర్లు పెంచాలని తెలిపారు. ఈ–పంట నమోదు చివరి తేదీ నవంబర్–15 వరకు పొడిగించాలన్నారు. ఆర్‌ఎస్‌కే సిబ్బందికి కొత్త ట్యాబ్‌లు అందించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరాజు, జిల్లా జనరల్ సెక్రటరీ జి.ఫిలిప్, అసోసియేట్ ప్రెసిడెంట్ గురుబ్రహ్మం, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు వి.కల్యాణ్, ఎం.బోస్ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ నిర్మాణ పనులు త్వరలో పూర్తి

చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



బైపాస్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట: నియోజకవర్గ ప్రజలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసి వచ్చే నవంబర్ నాటికి అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండలంలోని బొప్పూడి వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి, జాతీయ రహదారుల అధికారులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలు తొలగి, ప్రమాదాలకు చెక్ పడుతుందని వెల్లడించారు. ప్రస్తుతం చెన్నై–కోల్‌కతా 16వ నంబర్ జాతీయ రహదారిపై బైపాస్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. బొప్పూడి నుంచి తిమ్మాపురం వరకు 16.384 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బైపాస్‌కు సంబంధించి భూసేకరణలో 25శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వం భరించే తొలి ప్రాజెక్టు దేశంలో ఇదేనన్నారు. బొప్పూడి నుంచి తిమ్మాపురం వరకు బైపాస్‌కు అనుసంధానంగా సర్వీసురోడ్డు, ఆ పక్కన డ్రెయిన్, గోడ నిర్మిస్తున్నట్లు తెలిపారు. గోడ నిర్మాణంలో కొన్ని సమస్యలు రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. గోడ నిర్మాణంలో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చే నవంబర్ నాటికి బైపాస్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

ఈత పోటీల్లో జగదీష్‌కు పతకాల పంట



పతకాలు సాధించిన జగదీష్‌ను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గం ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి 10వ సీనియర్స్ అంతర్ జిల్లాల ఆక్వాటిక్ (స్విమ్మింగ్) చాంపియన్‌షిప్ పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ 3 బంగారు, 2 రజిత పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ వై.మధుసూదనరావు మంగళవారం తెలిపారు. బాపట్లజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 25వ తేదీన నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థి జగదీష్ 100మీటర్లు, 200మీటర్లు బటర్‌ఫ్లై, 800మీటర్లు ఫ్రీ స్టైల్ విభాగాలలో బంగారు పతకాలు సాధించాడని తెలిపారు. అలాగే 50మీటర్లు బటర్‌ఫ్లై, 400 మీటర్లు ఐ.ఎం విభాగాలలో రజత పతకాలు సాధించాడని వివరించారు. పతకాలు సాధించిన జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

రైల్వేగూడ్స్ షెడ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



ఎస్‌టీజీఎం అరుణ్‌కుమార్‌జైన్‌తో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నాదెండ్ల: రైల్వే గూడ్స్ షెడ్ నిర్మాణ పనులు పూర్తయి సెప్టెంబర్ 10 కల్లా వినియోగంలోకి వచ్చేవిధంగా చూడాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రైల్వే అధికారులకు సూచించారు. నాదెండ్ల మండలం సాతులూరు రైల్వేస్టేషన్‌ను మంగళవారం ఎంపీ సందర్శించారు. కొద్దిరోజులుగా జరుగుతున్న రైల్వే గూడ్స్ షెడ్డు నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల 10 నాటికి పనులు పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా కాంట్రాక్టర్‌ను, రైల్వే ఎస్‌టీజీఎం అరుణ్‌కుమార్‌జైన్‌ను కోరారు. ఈ షెడ్డు నిర్మాణ పనులు పూర్తయితే రైతులకు అవసరమైన ఎరువులను నిల్వ చేసి, అందించేందుకు వీలవుతుందన్నారు. షెడ్డు వద్ద అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ఆయనతో పాటూ జిల్లా వ్యవసాయాధికారి మురళి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, రవికుమార్, ఏఓ హరిప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అంతరపంటల సాగుతో దోమల ఉధృతి నివారణ

ప్రకృతి వ్యవసాయ డీపీఎం అమలకుమారి



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: పత్తిలో అంతర పంటల సాగుతో తెల్లదోమ, పచ్చదోమలతో పాటు గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ వేసిన 42,312మంది రైతులకు ఈ–క్రాప్ బుకింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. పత్తిలో అంతర పంటలుగా గోరు చిక్కుడు, గోంగూర, ముల్లంగి, క్యారెట్, పెసరతో పాటు రక్షక పంటలుగా జొన్న, సజ్జ వేయాలని తెలిపారు. వీటి ద్వారా పత్తిని ఆశించిన తెల్లదోమ, పచ్చదోమ ఉధృతిని తగ్గించవచ్చని తెలిపారు. రక్షక పంటల వలన మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుందని వివరించారు. దీంతోపాటు పత్తిని ఆశించే గులాబీరంగు పురుగు ఉధృతి తగ్గుతుందని తెలిపారు. రాష్ట్ర ఎస్‌ఎఫ్‌ఏ విజయకుమారి, అడిషనల్ డీపీఎం ప్రేమ్ రాజ్, జిల్లా ఎస్‌ఎఫ్‌ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై లైంగికదాడి, హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు తెలియజేస్తున్న సీఐ సుబ్బానాయుడు, ఎస్‌ఐ పుల్లారావు, వెనుక ముసుగులో నిందితులు

నాదెండ్ల: ఒంటరి మహిళపై లైంగికదాడి జరిపి దారుణంగా హత్య చేసిన నిందితులను మంగళవారం నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్‌ఐ జి.పుల్లారావు విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. గణపవరం శివాలయం వీధిలో నివాసం ఉండే షేక్ మస్తాన్‌బీ (45) భర్త మరణించటంతో కొంతకాలంగా అదేవీధిలో ఉంటున్న పీర్లచావిడిలో నివాసం ఉంటోంది. ఒడిశా రాష్ట్రం, బద్రక్ జిల్లా, ఫతేపూర్ మండలం, లెంతార్ గ్రామానికి చెందిన మనోజ్‌మాలిక్ అలియాస్ రాజుమాలిక్ కొంతకాలంగా గణపవరంలోని రాజీవ్‌గాంధీకాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ వివిధ పరిశ్రమల్లో ముఠా పనులకు వెళ్లేవాడు. అయితే అక్కడ అద్దె చెల్లించకపోవటంతో ఖాళీ చేయించారు. దీంతో తమ మేస్త్రీ గాజుల మేరయ్య సాయంతో పీర్లచావిడిలో ఉంటున్నాడు. ఈ నెల 8వ తేదిన అర్ధరాత్రి సమయంలో స్థానికంగా ఉండే ఎం.సాంబశివరావుతో కలిసి మద్యం, గంజాయి సేవించారు. రాజుమాలిక్ పీర్లచావిడీలోని మరో గదిలో నిద్రిస్తున్న మస్తాన్‌బీని చీరతో గొంతునులిమి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆపై హత్యచేసి పరారయ్యాడు. మంగళవారం రాజుమాలిక్, సాంబశివరావు ఇద్దరూ గణపవరం నుంచి నాదెండ్ల వెళ్లే డొంక రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఇరువురినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులను అరెస్టు చేయటంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సీఐ సుబ్బానాయుడు అభినందించారు.

ఫణిదం చేనేత సొసైటీ అభివృద్ధికి కృషి

చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి



ఫణిదం చేనేత సొసైటీలో వస్త్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ రేఖా రాణి

సత్తెనపల్లి: ఫణిదం చేనేత సొసైటీలో పనిచేసే కార్మికులకు నూతన డిజైన్లపై శిక్షణ ఇచ్చి సొసైటీని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తానని చేనేత జౌళిశాఖ కమిషనర్ రేఖా రాణి అన్నారు. పట్టణ సమీపంలోని శాతవాహన స్పిన్నింగ్ మిల్లు, యాంకి యారాన్ ప్రాసెస్ అండ్ ప్రాడక్షన్ యూనిట్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాంకీ యారన్ ట్రైనింగ్ డైయింగ్ యూనిట్‌ను ట్రైనింగ్ సెంటర్‌గా మార్చి అభివృద్ధి చేస్తానని ఆమె తెలిపారు. అనంతరం రైల్వే గేట్ సమీపంలోని ఫణిదం చేనేత సొసైటీని ఆమె సందర్శించారు. ఫణిదం చేనేత సొసైటీలో కార్మికులు నేసిన దుస్తులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫణిదం వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీలో వర్కర్లకు నూతన డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చి వారిలో అవగాహన కల్పించి చేనేతను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చేనేత సొసైటీలో కార్మికులు తయారుచేసిన దుస్తులను ఆమె పరిశీలించారు. వస్త్రాల నాణ్యతను కమిషనర్ కొనియాడారు. ఏడీపీ వనజ, డీఓ నాగమల్లేశ్వరరావు, ఏడీఓ రాఘవరావు, సొసైటీ అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడిపై దాడి

నాదెండ్ల: అమీన్ సాహెబ్‌పాలెం పీవీసీ ఆయుర్వేద వైద్యుడిపై కొందరు వ్యక్తులు దాడిచేసి గాయపరిచిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామానికి చెందిన పూనాటి లక్ష్మీనారాయణ, వీరేంద్రకుమార్‌లు సోదరులు. తండ్రి వెంకటేశ్వరరావు మరణం తర్వాత ఆస్తి పంపకాల విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతంలో తండ్రి వెంకటేశ్వరరావు పీవీసీ ఆయుర్వేద వైద్యశాల నడిపేవారు. ఆయన మరణంతో వైద్యశాలను పెద్దకుమారుడు లక్ష్మీనారాయణ నిర్వహిస్తున్నాడు. తన సోదరుడు వీరేంద్రకుమార్, ఈదర వెంకటసుబ్బారావు, ఈదర బ్రహ్మానందం, కావూరి శ్రీనివాసరావులతో కలిసి మంగళవారం ఉదయం సుమారు 8.15 గంటలకు ఆసుపత్రిలోకి వచ్చి రోగులకు వైద్యం చేస్తున్న తనపై దాడికి పాల్పడ్డారన్నారు. వారి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా, రాళ్లతో దాడి చేశారన్నారు. తనకు వారి నుంచి ప్రాణహాని ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విజ్ఞాన్ నిరుల విద్యార్థిని



షేక్ షేహనాజ్‌బీని అభినందిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ కళాశాల విద్యార్థిని ఎంపికవ్వటం ఎంతో సంతోషంగా ఉందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాధిక తెలిపారు. మంగళవారం పెదపలకలూరు గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. బీటెక్ తొలి ఏడాది విద్యార్థిని షేక్ షేహనాజ్‌బీ జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో అండర్ 20 విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. చదువుతోపాటు క్రీడలలో కూడా విద్యార్థినులు రాణించటం గర్వంగా ఉందన్నారు. షేహనాజ్‌బీని కళాశాల బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి డాక్టర్ టీవీఎస్ ప్రసన్న, పీడీ కిషోర్‌కుమార్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

కేంద్ర పెన్షన్ పథకంపై హర్షం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): కేంద్ర ఉద్యోగుల కోసం యునైటెడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్) అమలు చాలా సంతోషదాయకమని గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ స్కీం వల్ల డివిజన్ పరిధిలో 4,707 మంది దాదాపు 3,750 మంది ప్రయోజనం పొందుతారన్నారు. 2004 తర్వాత చేరిన ఉద్యోగులకు ఎక్కువ మేలు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ సీనియర్ డీపీఓ షేక్ షహబాజ్ హనూర్, సీనియర్ డీఎఫ్‌ఎం అమూల్య బి.రాజ్, సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్, డీసీఎం కె.కమలాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.